RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -80 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 1 ఏప్రిల్ 2026


# క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే

# తొలి ప్రయోజనాలు

## ఏప్రిల్ 14న దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్

**'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం హార్డ్ వేర్ ఉత్పత్తి లక్ష్యం**

**2030 నాటికి గ్లోబల్ క్వాంటం హబ్‌గా ఏపీని తీర్చిదిద్దేలా ప్రణాళిక**

**క్వాంటం హార్డ్ వేర్ తయారీ ఎకోసిస్టంపై సీఎం చంద్రబాబు కీలక రౌండ్ టేబుల్ సమావేశం**




**అమరావతి మార్చి 31ఆంధ్ర ప్రగతి:** అమరావతి క్వాంటం సెంటర్లో ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటర్ (టెస్టింగ్) ఏర్పాటు చేస్తున్నారని, ఇది విద్యార్థులకు క్వాంటం టెస్టు కోసం ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి

మిగతా 2లో.



# రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

**కాంగ్రెస్ నేతల పై ప్రధాని మోదీ ఫైర్**

**ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ నిలకడగా ఉందని వ్యాఖ్య**

**కాంగ్రెస్ వదంతులు వ్యాపింపజేస్తోందని తీవ్ర విమర్శలు**

**గుజరాత్‌లోని డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించిన ప్రధాని**

**ఈ ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెసే కారణమని ఆరోపణ**

2లో.

# టోల్ ప్లాజాల వద్ద నగదుకు స్వస్తి..




## నేటి నుంచి కొత్త నిబంధన!

**ఇకపై ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులు**

**రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేసేందుకే ఈ నిర్ణయం**

**ఫాస్టాగ్ లేని వాహనాలకు జరిమానాలు విధించే అవకాశం**

**ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచన**

**, న్యూఢిల్లీ మార్చి 31ఆంధ్ర ప్రగతి:**దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఇది ఒక ముఖ్యమైన అప్‌డేట్. (ఏప్రిల్ 1వ తేదీ) నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది.

మిగతా 2లో.

# పవన్ కల్యాణ్ శాఖకు అవార్డుల పంట..

**24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపి**

**డిప్యూటీ సీఎం నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 5 జాతీయ అవార్డులు**

**రెండు విభాగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్**



**న్యూఢిల్లీ మార్చి 31ఆంధ్ర ప్రగతి:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న ఈ శాఖకు ఏకంగా ఐదు జాతీయ పురస్కారాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సేవల విస్తరణలో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గానూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది.

మిగతా 2లో.

# నేడు లోక్‌సభలో 'అమరావతి' బిల్లు

**2024 జూన్ 2 నుండి అమలులోకి**



**అమరావతి, న్యూఢిల్లీ మార్చి 31ఆంధ్ర ప్రగతి:** లోక్‌సభ ముందుకు నేడు (బుధవారం) అమరావతి బిల్లు రానుంది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రూపొందించిన ఈ బిల్లును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన కసరత్తును కేంద్ర ప్రభుత్వ పూర్తి చేసింది. 2024 జూన్ రెండవ తేది నుండి అమరావతికి చట్టబద్ధత అమలులోకి

మిగతా 2లో.

# చంద్రబాబు పట్టుదలతోనే తుంగభద్ర గేట్ల అమరిక

**తుప్పపట్టిన వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు**

**కొత్త గేట్లపై మంత్రి పయ్యావుల వెల్లడి**

**అమరావతి, మార్చి 31ఆంధ్ర ప్రగతి:** తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోతే కళ్లలో నీళ్లు వచ్చాయని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. డ్యామ్ వద్ద నుంచి మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తే.. రైతుల ప్రయోజనాలు కాపాడాలని ఆదేశించారని తెలిపారు. గేట్లు మొత్తం తుప్పుపట్టాయని.. చేత్తో ముట్టుకుంటే విరిగిపోతున్నాయని అన్నారు.

మిగతా 2లో.



# వైసిపి వలసదారులపట్ల అప్రమత్తం

**అవసరం కోసం వచ్చే అవకాశవాదులతో జాగ్రత్త**

**పార్టీలో కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు-పార్టీ శ్రేణులకు మంత్రి లోకేశ్ హెచ్చరిక**



**అమరావతి,, మార్చి 31ఆంధ్ర ప్రగతి:** వైసీపీ నుంచి తెలుగుదేశంలోకి వచ్చే వలసదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నామని.. అవసరం కోసం వచ్చే అవకాశవాదులు పార్టీలో కొనసాగుతారనే గ్యారంటీ లేదన్నారు. కష్ట సమయంలోనూ పార్టీని అంటిపెట్టుకుని ఉన్న కార్యకర్తలకే ప్రాధాన్యం ఉండాలని పేర్కొన్నారు. వైసీపీ నుంచి వచ్చే వారిని చేర్చుకునే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తూ.. చర్చించి నిర్ణయం తీసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు.

మిగతా 2లో.

# ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

**బంకర్ బస్టర్లతో అమెరికా విధ్వంసం**

**దుబాయ్‌లో కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి**

**హార్ముజ్‌లో టోల్ వసూలుకు ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర**

**'ధైర్యం చూపండి..చమురు తెచ్చుకోండి' : రెచ్చగొడుతున్న ట్రంప్**

**అమెరికా అధ్యక్షుల మెహర్బానీ కోసం గల్ఫ్ దేశాల వెంపర్లాట**



2లో.

# అసత్య ప్రచారం

**గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాపై అనేక అసత్య ప్రచారం**

**డీలర్లు, ఉన్నతాధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష**

**సోషల్ మీడియా వదంతులను నమ్మొద్దని సూచన**



2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక




# రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

## కాంగ్రెస్ నేతల పై ప్రధాని మోదీ ఫైర్

**, న్యూఢిల్లీ మార్చి 31ఆంధ్ర ప్రగతి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది" అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం



పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు.

ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నారు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు.

ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# చంద్రబాబు పట్టుదలతోనే తుంగభద్ర గేట్ల అమరిక

**మొదటిపేజీ తరువాయి**

రైతుల ప్రయోజనాలు కాపాడటం కోసం కొత్త గేట్లను అమర్చేందుకు గో ఆల్ అవుట్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్లాలని సూచించారన్నారు. తుంగభద్ర డ్యామ్ గేట్లు ఉన్నంత పొడవు దేశంలో మరో ప్రాజెక్టుకు లేవన్నారు. ఒక్క సీజన్‌లో రైతుల ప్రయోజనాల కోసం ఇప్పటికే 18 కొత్త గేట్లు అమర్చామని చెప్పారు. భేషజాలకు పోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు.. కర్ణాటకకు వచ్చి సీఎం సిద్ధరామయ్యతో కాలువ ఆధునీకరణపై చర్చలు జరిపారన్నారు. రైతుల ప్రయోజనాలు శాశ్వతమని.. అందుకే తుంగభద్ర డ్యామ్ గేట్లతో పాటు చైన్‌లను మార్చుతున్నామని చెప్పారు. ఇప్పటికే 18 గేట్లను అమర్చామని.. మొత్తం 33 గేట్లను అమర్చి కాలువ మీద ఉండే రైతులకు నమ్మకం కలిగిస్తామని అన్నారు. అనంతపురం జిల్లా ప్రజల రుణం తీర్చుకోవడానికి అనునిత్యం పని చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన గో ఆల్ అవుట్ స్ఫూర్తితోనే గేట్లను అమర్చగలిగామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. తుంగభద్ర రిజర్వాయర్ చరిత్రలో ఇది



అద్భుత ఘట్టమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. పాత తుప్పుపట్టిన గేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చడం అనేది కాస్త కష్ట సాధ్యమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో పూర్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో విపక్షం విషపక్షంలా మారిందని.. రాయలసీమ పట్ల చిత్తశుద్ధితో టీడీపీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాయలసీమకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు 20 నెలల్లో 8 వేల కోట్ల రూపాయలు రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేశామని కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. తుంగభద్ర డ్యామ్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గేట్లను మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. తుంగభద్ర డ్యామ్ సైట్ నుంచి సీఎం చంద్రబాబుకు మంత్రి ఫోన్ చేశారు. డ్యాం సైట్ నుంచే కొత్త గేట్లు అమర్చేందుకు జరుగుతున్న పనులను సీఎంకు ఆర్థిక మంత్రి

వివరించారు. గేట్ల బిగింపు పక్రియ పూర్తి కావడానికి ఇంకా ఎన్ని రోజుల సమయం పడుతుందని మంత్రి పయ్యావులను సీఎం అడిగారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి తుంగభద్ర గేట్ల బిగింపు పనులు పూర్తి కానున్నట్టు మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో కర్ణాటక ప్రభుత్వం కూడా త్వరితగతిన పనులు చేపట్టిందని సీఎంకు పయ్యావుల కేశవ్ వివరించారు. గేట్ల బిగింపు పనులు పూర్తయితే కర్నూలు, అనంతపురం జిల్లాకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. సీమ జిల్లాలకు మేలు కలిగేలా తుంగభద్ర గేట్ల బిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించినందుకు సీఎంకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధన్యవాదాలు తెలిపారు.

# వైసిపి వలసదారులపట్ల అప్రమత్తం

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలతో మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చు.. అందుకనుగుణంగా శ్రేణుల్ని సిద్ధం చేయాల్సి ఉందన్నారు. యాక్టీవ్ కావాలంటూ జిల్లా పార్టీ అధ్యక్షులకు సూచించారు. యూనిట్, బూత్‌లను బలోపేతం చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తూ కష్టపడే పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పార్టీనే సుప్రీమ్ అనేది ఎమ్మెల్యేలకు సైతం స్పష్టం కావాలన్నారు. వైసీపీ అహంకార ధోరణి వల్ల 151 సీట్లు 11 అయ్యాయని పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఓర్పు, సహనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రతి బూత్‌కు వెళ్లడం ద్వారా 1985 తర్వాత మంగళగిరి నియోజకవర్గంలో పార్టీ విజయం సాధించిందని వివరించారు. రెవెన్యూ విషయాల్లో ఎమ్మెల్యేల జోక్యం ఎంత మాత్రం ఉండకూడదని వివరించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలు, పెట్టుబడిదారుల్ని బెదిరించే వ్యవహారాల్లో ఎమ్మెల్యేల పాత్ర ఉంటే పార్టీ ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదని కుండబద్దలు కొట్టారు. పార్టీ బీ ఫామ్ ఇస్తేనే వాళ్లు మళ్లీ ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తారనే విషయం గుర్తుంచుకోవాలంటూ వారికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ప్రజల్లో సానుకూలత ఉన్నప్పుడు, ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తీరు పార్టీకి నష్టం చేసేలా ఉంటే ఉపేక్షించేందుకు అధినేత సీఎం చంద్రబాబు సిద్ధంగా లేరని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెండింగ్ నామినేటెడ్ పదవులన్నీ ప్రాధాన్యత క్రమంలో త్వరగా పూర్తి చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలకు పార్టీలో ఖచ్చితంగా గుర్తింపు ఉండాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, సమన్వయకర్తలు భూమిరెడ్డి, బీదా రవిచంద్ర, సుజయ్ కృష్ణ రంగారావు, దామచర్ల సత్య, దీపక్ రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, వేపాడ చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్‌లకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశర చేశారు. ఒక వ్యవస్థలా టీడీపీని తీర్చిదిద్దుదామన్నారు. వినే నాయకుడు చంద్రబాబు ఉండటం మన అదృష్టమని చెప్పారు. మీరంతా తెలుగుదేశం పార్టీ భవిష్యత్ నాయకులని అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ యూనివర్సిటీ లాంటిదని అభివర్ణించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రెండో ముఖ్యమంత్రి తెలుగుదేశం ప్రొడక్ట్ అని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. నాయకులను తయారు చేసే కార్ఖానా టీడీపీ అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నిరంతరం మారుతూ వచ్చిందని చెప్పారు. గ్రామ స్థాయి నాయకుడు బాగా పని చేస్తే వారిని గుర్తించి పొలిట్ బ్యూరోలో కూర్చోబెట్టాల్సి ఉందన్నారు. రాబోయే పొలిట్ బ్యూరోలో మీరు ఆ మార్పును చూడబోతున్నారని క్లస్టర్ ఇంచార్జ్‌లకు స్పష్టం చేశారు. చంద్రబాబే మన అధినేత అని తెలిపారు. మనందరం కార్యకర్తలమని పేర్కొన్నారు. ఆయనే మన సేనాధిపతి అని.. మనం సైనికులమని.. దీనిని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని మంత్రి లోకేశ్ సూచించారు. జగన్ రెడ్డి క్రెడిట్ చోరీ డిజార్డర్(సీసీడీ) వ్యాధితో బాధపడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. అనకాపల్లిలో ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్, విశాఖలో డేటా సెంటర్, అనంతపురంలో కియా కార్ల పరిశ్రమ, భోగాపురం విమానాశ్రయం, బల్క్ డ్రగ్ పార్క్ వంటి పరిశ్రమలు తానే తెచ్చానంటూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని వైఎస్ జగన్ వైఖరిపై మంత్రి లోకేశ్ మండిపడ్డారు. ఆ జబ్బు నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు వంటిదని నారా లోకేశ్ ఈ సందర్భంగా చమత్కరించారు. అందుకే పార్టీ కోసం అధిక సమయం కేటాయిస్తున్నామని చెప్పారు. పార్టీ వల్లే మనకు ఈ గౌరవం లభిస్తోందన్నారు. మనం ఈ స్థాయిలో ఉన్నామంటే చంద్రబాబు కృషే కారణమని.. కలిసికట్టుగా పనిచేయాలంటూ శ్రేణులకు మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

----

# గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాపై అసత్య ప్రచారం

**విజయవాడ,, మార్చి 31ఆంధ్ర ప్రగతి:** వదంతుల కారణంగా ఒకే సారి ఐదు లక్షల గ్యాస్ బుకింగ్‌లు కావడంతో ఇబ్బందులు తలెత్తాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంతో అనేక వదంతుల కారణంగా ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటూ ఆదేశాలు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఎల్.పి.జి వినియోగదారులను పి.ఎన్.జి వైపు మళ్లించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాపై అనేక అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవారం గ్యాస్, ఆయిల్ డీలర్లు, ఉన్నతాధికారులతో మంత్రి నాదెండ్ల మనోహన్ సమావేశమయ్యారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. సరఫరా విషయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. డొమెస్టిక్ గ్యాస్‌కు సంబంధించి 16 ఏజెన్సీల నుంచి డెలివరీ విషయంలో జాప్యం జరుగుతుందని వివరించారు. ఈ సమస్యలను వెంటనే నివారించాలని వారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేసే 146 గ్యాస్ ఏజెన్సీలపై సెక్షన్ 6 ఏ కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. అందుకు సంబంధించి 4 వేలకుపైగా గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు ఆయిల్ కంపెనీలతో ప్రతిరోజూ మాట్లాడి గ్యాస్ కొరత లేకుండా చేస్తున్నామని తెలిపారు. మంగళవారం నుంచి కమర్షియల్ గ్యాస్ వినియోగానికి 70 శాతం వరకు సరఫరా చేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. గృహ వినియోగానికి నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజుల తర్వాత గ్యాస్ బుక్ చేసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజీల్ నిల్వలపై ఇప్పటికే సమీక్షించామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. మన రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ పుష్కలంగా ఉందని తెలిపారు. 7,900 లీటర్ల పెట్రోల్, 20 వేల లీటర్ల డీజిల్ మనకు రోజు వారీ అవసరంగా ఉందని చెప్పారు. ఈ సమస్య వచ్చిన తర్వాత డీజిల్ 8 శాతం, పెట్రోల్ 2.5 శాతం వినియోగం పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా ఎటువంటి కొరత లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. ఏజెన్సీలు, గోడౌన్ల వద్దకు వెళ్లి హడావుడి చేయవద్దని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ఆన్ లైన్‌లో బుక్ చేసుకున్న అనంతరం వన్ టైమ్ పాస్వర్డ్ ద్వారానే గ్యాస్ డెలివరీ జరుగుతుందని స్పష్టం చేశారు. గల్ఫ్‌లో యుద్ధం కారణంగా ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమర్షియల్ గ్యాస్ వినియోగించే వారు జిల్లాల్లోని జాయింట్ కలెక్టర్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. కమర్షియల్ గ్యాస్ విషయంలో హోటల్స్, రెస్టారెంట్లు, ఆసుపత్రుల వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 17 రోజుల వరకు ఎటువంటి ఇబ్బంది లేనంతగా గ్యాస్, ఆయిల్ నిల్వలు ఉన్నాయన్నారు. ఎల్.పి.జి, పెట్రోల్, డీజీల్‌పై ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ం

# నేడు లోక్‌సభలో 'అమరావతి' బిల్లు

**మొదటిపేజీ తరువాయి**

వచ్చేలా ఈ బిల్లును రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును సవరించి రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరును చేర్చాలని, తద్వారా చట్ట బద్దత కల్పించాలని మార్చి 28వ తేదిన రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఆ తీర్మానంలో ప్రతిపాదించిన వివిధ అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం తాజా బిల్లు లక్ష్యాలులో చేర్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం -2014 ప్రకారం హైదరాబాద్ పది సంవత్సరాల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగే విషయం తెలిసిందే. ఆ గడువు 2024 జూన్ ఒకటవ తేదితో ముగియడంతో రెండవ తేది నుండి అమరావతిని రాజధానిగా గుర్తించాలని తాజా బిల్లులో పేర్కొన్నారు. ఆ మేరకు పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5, సబ్‌సెక్షన్ 2లో అమరావతిని ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా పేర్కొంటూ, 2024 జూన్ రెండవ తేది నుండి అమలులోకి వచ్చేలా సవరిస్తూ ప్రతిపాదించారు.

పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధతకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున సంబరాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రాజధాని ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

# టోల్ ప్లాజాల వద్ద నగదుకు స్వస్తి..

**మొదటిపేజీ తరువాయి**

ఇకపై టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై కొత్త నిబంధన అమల్లోకి రానుంది.రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో నగదు రహిత విధానాన్ని అమలు చేస్తున్నారు. టోల్ వసూళ్లలో పారదర్శకతను పెంచడంతో పాటు వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగకుండా వేగంగా వెళ్లేందుకు ఇది దోహదపడుతుంది. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గి, కాలుష్యం కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.అయితే, ఈ మార్పు వల్ల డిజిటల్ చెల్లింపులకు సిద్ధంగా లేని కొంతమంది ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సరైన ఫాస్టాగ్ లేని లేదా అందులో తగినంత బ్యాలెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో అటువంటి వాహనాలను టోల్ ప్లాజా వద్ద నిలిపివేసే అవకాశం కూడా ఉంది. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశారు. ఒకవేళ ఫాస్టాగ్‌లో సమస్య ఉంటే, టోల్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి యూపీఐ ద్వారా తక్షణమే చెల్లింపులు చేయవచ్చు. అయితే, కొన్నిసార్లు నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఈ లావాదేవీలు ఆలస్యం కావచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.అందువల్ల ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందే ఫాస్టాగ్ గా యాక్టివ్‌గా ఉంచుకోవడం, దానిలో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవడం చేయాలని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. ఫాస్టాగ్‌ను తమ బ్యాంకు ఖాతాతో సరిగ్గా లింక్ చేసుకోవడం కూడా ముఖ్యం. ముందుజాగ్రత్తగా స్మార్ట్‌ఫోన్‌లో పనిచేసే యూపీఐ యాప్‌ను సిద్ధంగా ఉంచుకోవడం మంచిది. ఈ మార్పు భారతీయ రహదారుల వ్యవస్థను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా మార్చడంలో ఒక కీలక ముందడుగుగా పరిగణిస్తున్నారు.

# పవన్ కల్యాణ్ శాఖకు అవార్డుల పంట..

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే... రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్-జన్ భాగీదారి అనే రెండు కీలక విభాగాల్లో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మరో విభాగంలో ద్వితీయ స్థానం, ఇంకో రెండు విభాగాల్లో తృతీయ స్థానం దక్కించుకుని మొత్తం ఐదు అవార్డులను కైవసం చేసుకుంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రోత్సహించే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో ఏపీ పనితీరు విశేషంగా మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో ఇదే విభాగంలో 24వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. అలాగే, తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులను ప్రోత్సహించే 'జల్ సంచయ్ - జన్ భాగీదారీ' కార్యక్రమంలోనూ ఏపీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌకర్యాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'పల్లెపండుగ 1.0', 'పల్లెపండుగ 2.0' వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

గ్రామసభలలో వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా 'పల్లెవెలుగు' కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడి, జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలు దక్కడం విశేషం.

# ఏప్రిల్ 14న దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్

**మొదటిపేజీ తరువాయి**

చంద్రబాబు నాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం క్వాంటం వ్యాలీ, హార్డ్‌వేర్ ఎకోసిస్టమ్స్‌పై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్డ్‌వేర్ ఉత్పత్తి, ఆల్గారిథమ్స్ రూపకల్పన వంటివి చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీ దేశానికి కొత్త దిశను చూపిస్తుందన్నారు. 2030 నాటికి ప్రపంచంలో ఐదు గ్లోబల్ హబ్‌లలో ఒకటిగా అమరావతి నిలుస్తుందని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం ఐటిని, ఇప్పుడు క్వాంటంను అందిపుచ్చుకుంటు న్నామని తెలిపారు. అవేర్ ద్వారా రియల్‌టైమ్ డేటా సేకరించడంతోపాటు రియల్‌టైమ్‌లో నిర్ణయాలు జరిగేలా చేపట్టామని తెలిపారు. ఎఐ డాక్టర్, ఎఐ ట్యూటర్, ఎఐ అగ్రనామిస్ట్ వంటి సేవలు పౌరులకు అందాల్సి ఉందని తెలిపారు. అమరావతిలో నిర్మిస్తున్న రాజధాని ఎనిమిది టవర్లలో ఆవిష్కరణలు, పరిశోధనలు, స్టార్టప్‌లకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. హార్డ్‌వేర్‌ను దిగుమతి చేసుకోకుండా ఇక్కడే తయారు చేసుకునేలా ప్రణాళిక ఉంటుందని వివరించారు. దీనికి అవసరమైన టెక్నాలజీ అందించాలని నేషనల్ క్వాంటం మిషన్‌ను కోరారు. రానున్న రోజుల్లో అత్యుత్తమ క్వాంటం హబ్‌గా రాష్ట్రం నిలుస్తుందని నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టరు డాక్టర్ జెవిబి రెడ్డి తెలిపారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఏర్పాటైన నేషనల్ క్వాంటం మిషన్ విజన్‌కు అనుగుణంగా రాష్ట్రంలో ఏర్పాటుకు సిఎం చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. ఐబిఎం, టిసిఎస్ వంటి సంస్థల భాగస్వామ్యంతో క్వాంటం టెక్నాలజీకి పెద్దయెత్తున చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఇప్పటికే వేలాది మందికి శిక్షణ ఇస్తున్నామని, దీనికి జాతీయ క్వాంటం మిషన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అనేక కంపెనీలు, స్టార్టప్‌లు దీనిలో భాగస్వామ్యం అవుతున్నాయని పేర్కొన్నారు. ఎపి క్వాంటం మిషన్ అపెక్స్ కమిటీ ఛైర్మన్ మద్రాసు ఐఐటి డైరెక్టరు డాక్టర్ కామకోటి ఆన్‌లైన్లో మాట్లాడారు. అమరావతి క్వాంటం సెంటర్ పరిధిలోకి రానున్న మూడేళ్లలో వెయ్యికిపైగా స్టార్టప్‌లు వస్తున్నాయని తెలిపారు. దీనికి అనుగుణంగా సదుపాయాలు కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. అమరావతి క్వాంటం సెంటర్ (ఎక్యూసి) డైరెక్టరు సివి శ్రీధర్ మాట్లాడుతూ.. 2030 నాటికి ప్రపంచంలో టాప్ 5 క్వాంటం హబ్‌లలో అమరావతి ఒకటిగా నిలవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికోసం ఎనిమిది టవర్లతో కూడిన భవనాలు నిర్మిస్తున్నామని, ఏప్రిల్ 14న మేథాటవర్స్, ఎస్ఆర్ఎంలోని సెంటర్లలో క్వాంటం కంప్యూటర్ టెస్టు జరుగుతుందని పేర్కొన్నారు. అక్టోబరు నాటికి ఇన్నోవేషన్ సెంటర్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు.ఎక్యూసి ఎక్స్‌పర్ట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కె సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. అమరావతిలో నిర్మించే ఎనిమిది టవర్లలో రెండిటిని క్వాంటం టెక్నాలజీ హార్డ్‌వేర్ ఆపరేషనల్ సిస్టమ్ కోసం నిర్మిస్తున్నారని తెలిపారు. క్యూబీట్స్ ప్రతినిధి మల్లికార్జున్ మాట్లాడుతూ.. తమ సంస్థ డీప్ టెక్నాలజీ, పొజిషనింగ్, లేజర్ అప్లికేషన్, సెమీ కండక్టర్ వంటి అంశాల్లో పనిచేస్తుందని తెలిపారు. క్వాంటం ఎఐ గ్లోబల్ ప్రతినిధి చిట్టూరి సంజరు మాట్లాడుతూ.. ప్రతి విదార్థినీ క్వాంటం నిపుణుడిగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సీడాక్ ప్రతినిధి మాగేష్ యథిరాజన్, డిడాట్ ప్రతినిధి డాక్టర్ రాజకుమార్ ఉపాధ్యాయ, క్యూబిట్ ఫోర్స్ ప్రతినిధి డాక్టర్ వెంకట సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ఎం ప్రొఫెసర్ సతీష్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.


# ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

టెహ్రాన్: ఇరాన్‌లో అణుకేంద్రాలు కలిగి ఉన్న కీలక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో భీకర స్థాయిలో విరుచుకుపడింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఈ విషయాన్ని పేర్కొంది. మరోపక్క ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే, ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా- ఇజ్రాయిల్ దాడులకు పాల్పడ్డాయని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దాడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో వరుస పేలుళ్లు చోటుచేసుకోగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీనిపై ఇరాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా.. ఇరాన్ సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇస్ఫహాన్‌లో ఓ భూగర్భ కేంద్రానికి తరలించినట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

# శిక్షణతో భారతీయ జనతా పార్టీని అభివృద్ధి పదంలో నడపడమే నా ప్రధాన లక్ష్యం.!

## నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 31:**
పార్టీ నిర్మాణం, బలోపేతానికి శిక్షణ కార్యక్రమాలు కీలకమని నంద్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీని అభివృద్ధి పథంలో నడిపించడమే నా ప్రధాన లక్ష్యమని నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు తాలూకాలోని కొత్తపల్లి మండలంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పాల్గొని నాయకులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లెల కృష్ణారెడ్డి, చల్లా దామోదర్ రెడ్డి, శంకర్ గౌడ్, వీరం మురలీధర్ రెడ్డి తదితరులు, మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు పట్టణం, రూరల్ మండలాల పరిధిలో నిర్వహించిన శిక్షణ సమావేశానికి వక్తగా, ముఖ్య అతిథిగా హాజరైన అభిరుచి మధు పార్టీ కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. శిక్షణ ద్వారా నాయకుల్లో సామర్థ్యం పెంపొందించి, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా స్పందించాలని సూచించారు.
జాతీయ మహిళా మైనార్టీ నాయకురాలు శబానా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బయ్య ఆచారి, చల్లా దామోదర్ రెడ్డి, పసుపుల రవీంద్ర కుమార్, విశ్వరూప ఆచారి, పట్టణ, మండల అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో.. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ.





**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు మార్చి 31:**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ పి వి ఎన్ మాధవ్ ఆదేశం మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీ అభిరుచి మధు సూచన మేరకు ఈ కార్యక్రమం జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి మోమిన్ షబానా ఆధ్వర్యంలో జరిగినది. నంద్యాల జిల్లా, ఆత్మకూరు అర్బన్, రూరల్ మండలాల దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ సమావేశం ఆత్మకూరు పట్టణంలోని స్థానిక థెరిసా కాలేజీలో,సమావేశం జరిగినది. ఈ కార్యక్రమం లో ఆరు కాలాంశములపై శిక్షణ ఇవ్వడం జరిగినది. మొదటి కాలాంశం లో జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి మోమిన్ షబానా అధ్యక్షతన, పార్టీ నిర్మాణం జిల్లా అధ్యక్షులు శ్రీ అభిరుచి మధు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి వివరించడం జరిగినది. రెండవ కాలాంశంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ రవికుమార్, భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం గురించి పార్టీ కార్యకర్తలకు వివరించడం జరిగినది. మూడవ కాలాంశంలో సోషల్ మీడియా గురించి, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి, శ్రీ అశ్విని కుమార్ పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. నాలుగవ కాలాంశంలో, బిజెపి సీనియర్ నాయకులు, శ్రీ చల్లా దామోదర్ రెడ్డి గారు, కమిటీలు జిల్లా కమిటీలు మండల కమిటీలు, బూత్ కమిటీ, శక్తి కేంద్రాల నిర్మాణం గురించి పార్టీ కార్యకర్తలకు వివరించడం జరిగినది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు.

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మార్చి 31:** రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశంలో మరల ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ గా గుర్తించిన రహదారి ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా బ్యారికేడింగ్, రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్ లాంటివి ఏర్పాట్లను త్వరితగతిన చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి, నేషనల్ హైవే కర్నూలు,అనంతపురం, కడప ప్రాజెక్ట్ డైరెక్టర్లను ఆదేశించారు.. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్ కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు కు సంబంధించిన ప్రతిపాదనలు కుడా నుండి రాగానే త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. ఉల్లిందకొండ వద్ద పిస్తా హౌస్ నుండి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వరకు ఇల్యూమినేషన్ పనులు వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హైవే, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అదే విధంగా నన్నూరు టోల్ గేట్ వద్ద కూడా ఇల్యూమినేషన్ లైటింగ్ పనులు చేయాలన్నారు. హైవే మధ్యలో ఉండే మీడియన్ల ఏమైనా ఓపెన్ చేసి ఉంటే వాటిని మూసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే పనులలో పురోగతిని తీసుకొని రావడంతో పాటు, గడువులోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. నేషనల్ హై వే స్ట్రెచ్ లలో మీడియన్స్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ నేషనల్ హై వే అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నేషనల్ హైవే పిస్తా హౌస్ నుండి చిన్నటేకూరు వరకు, నన్నూరు టోల్ గేట్ వద్ద హై మాస్ ఇల్యూమినేషన్ లైటింగ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే అప్రోచ్ రోడ్ ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అదే విధంగా స్పీడ్ బ్రేకర్ లకు పెయింటింగ్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హై వే స్ట్రెచ్ లలో మీడియన్స్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు.సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డి టీ సీ శాంత కుమారి, ఎన్ హెచ్ పిడి లు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మార్చి 31:**
జిల్లాలో మత్తు పదార్థాల రవాణా,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలలో, కళాశాలల్లో "సే నో టు డ్రగ్స్" అనే పోస్టర్ లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఈఓ ను ఆదేశించారు. విద్యా సంస్థల వద్ద మత్తు పదార్థాల విక్రయాలపై గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సు ల ద్వారా మత్తు పదార్థాల రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్టీసీ ఆర్ ఎం ను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నగరంలో ఉన్నటువంటి చీకటి ప్రదేశాలలో కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేసి, మంచి లైటింగ్, పెయింటింగ్ మరియు సీసీటీవీ కెమెరాలను అమర్చాలని తద్వారా సంబంధిత ప్రమాదకరమైన ప్రాంతాలు సురక్షితమైన ప్రదేశాలుగా మారిపోయే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడైనా గంజాయి సేవిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు అనుమానం వచ్చినట్లయితే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం చేరవేయాలని ఎస్పీ అధికారులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలల్లో గంజాయికి వ్యతిరేకంగా అవగాహన బోర్డులు, పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయికి దూరంగా ఉండాలని మరియు సమాచారం ఉంటే 1972 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపే పెద్ద బ్యానర్లను ప్రదర్శించాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఆర్ ఎం శ్రీనివాసులు, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, డిఇఓ సుధాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# పోటాపోటీగా నంద్యాల మున్సిపల్ మార్కెట్ వేలాలు.!

**-కూరగాయల వేలం పాటలు 51 లక్షల 15 వేలకు దక్కించుకున్న సుబ్బయ్య.**

**..సైకిల్ స్టాండ్ వేలం పాటలు లక్షా 31 వేలకు దక్కించుకున్న షేక్ షరీఫ్.**





కూరగాయల మార్కెట్ వేలం పాట దక్కించుకున్న వెంకట సుబ్బయ్య.



సైకిల్ స్టాండ్ వేలం పాట దక్కించుకున్న షేక్ షరీఫ్

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 31:**
నంద్యాల మున్సిపాలిటీలో గత మూడు సంవత్సరాలుగా వాయిదా పడుతూ వచ్చిన నంద్యాల మున్సిపాలిటీ కూరగాయల మార్కెట్ గేటు,సైకిల్ స్టాండ్ వసూళ్ల వేలం పాటకు ఎట్టకేలకు ముగింపు పలికింది. మంగళవారం మున్సిపాల్టీ ఆర్ఓ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో ఈ వేలంపాట జరిగింది. మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో హర్షద్, వెంకట సుబ్బయ్యల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది.
వేలంపాట ప్రారంభం నుంచే ఇద్దరు పోటీదారులు 'సై అంటే సై' అన్న రీతిలో బిడ్లు పెంచుతూ ఉత్కంఠభరితంగా పోటీ కొనసాగించారు. చివరికి వెంకటసుబ్బయ్య రే51 లక్షల 15 వేలతో అత్యధిక బిడ్ సాధించి కూరగాయల మార్కెట్ గేటు వసూళ్ల హక్కులను దక్కించుకున్నారు. అలాగే కూరగాయల మార్కెట్‌లో సైకిల్ స్టాండ్ నిర్వహణకు సంబంధించిన వేలం పాటలో షేక్ షరీఫ్ రూ.1 లక్ష 31 వేలతో హక్కులను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా వాయిదా పడుతున్న ఈ వేలంపాటను ఈరోజు విజయవంతంగా నిర్వహించగలిగాం. హర్షద్, వెంకటసుబ్బయ్యల మధ్య మంచి పోటీ నెలకొంది. చివరకు వెంకటసుబ్బయ్యకు హక్కులు కేటాయించాం. మున్సిపాలిటీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ వేలంపాటతో మున్సిపాలిటీకి గణనీయమైన ఆదాయం లభించనుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ వెంకట రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు 'శిల్పా' భరోసా.!

### 217 మంది మహిళలకు 35 లక్షల 51 వేల రూపాయల రుణాల పంపిణీ.

### - శిల్ప మహిళా బ్యాంక్ చైర్ పర్సన్ నాగిని రవిసింగారెడ్డి



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 31:** నంద్యాలలో మహిళా శక్తికి ఆర్థిక చేయూతనిస్తోంది శిల్పా మహిళా సహకార్ బ్యాంక్. పేదింటి మహిళలు స్వయం ఉపాధిలో రాణించి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో ఈ బ్యాంక్ అడుగులు వేస్తోంది. తాజాగా ఆర్థిక సంవత్సర ముగింపు సందర్భంగా 217 మంది మహిళలకు 35 లక్షల 51 వేల రూపాయల రుణాలను బ్యాంక్ చైర్‌పర్సన్ నాగిని రవిసింగారెడ్డి పంపిణీ చేశారు. మహిళా స్వయం శక్తికి నంద్యాల శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చిరునామాగా మారుతోంది. పేద మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే లక్ష్యంగా ఈ బ్యాంక్ గత 13 ఏళ్లుగా నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఆర్థిక సంవత్సర ముగింపు వేళ, బ్యాంక్ చైర్‌పర్సన్ నాగిని రవిసింగారెడ్డి చేతుల మీదుగా భారీగా రుణాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నాగిని రవిసింగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ కేవలం మహిళల కోసమే ఈ బ్యాంక్ నడుస్తోందని తెలిపారు. వేలాది మంది మహిళలు ఈ రుణాలతో స్వయం ఉపాధి పొంది, తమ కుటుంబాలకు అండగా నిలవడం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. ఏప్రిల్ నెల నుండి 5 వేల నుండి 25 వేల వరకు రుణ పరిమితిని పెంచినట్లు ప్రకటించారు, అలాగే భవిష్యత్తులో లక్ష రూపాయల వరకు పెంచేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు."మహిళలు ఒక ప్రణాళికాబద్ధంగా పొదుపు చేసుకోవాలని, ఉన్న వనరులతోనే ప్రగతి సాధించాలన్నారు. పేదింటి మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలనేదే మా ఆశయం అని అందుకే అతి తక్కువ వడ్డీకే ఈ రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, లక్ష్మీనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా ఖాతాదారులు పాల్గొన్నారు. రుణాల అందుకున్న మహిళలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ బ్యాంక్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# స్కూల్ విద్యార్థినిపై పలుమార్లు లైంగిక దాడి

**. 14 ఏళ్లకే తల్లయిన బాలిక.**
**-కర్నూలులో దారుణ ఘటన.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ మార్చి 31:**కర్నూలులో 14 ఏళ్ల బాలికపై జరిగిన దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూలి పనులు చేసుకునే దంపతులు 9వ తరగతి చదువుతున్న తమ కుమార్తెను రోజూ ఆటోలో స్కూలుకు పంపేవారు. అయితే, ఆ ఆటో డ్రైవర్ బోయ మహేంద్ర బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం అతని స్నేహితుడు, ట్రాక్టర్ డ్రైవర్ అయిన తెలుగు శివకుమార్ కూడా బాలికను బెదిరించి కోరిక తీర్చుకునేవాడు.ఎవరికైనా చెబితే చంపేస్తామని నిందితులిద్దరూ భయపెట్టడంతో, ఆ బాలిక తన బాధను ఎవరికీ చెప్పుకోలేకపోయింది.నిందితులు లైంగిక వేధింపులు కొనసాగడంతో ఆ బాలిక గర్భం దాల్చింది. మార్చి 28న ఆమె అనారోగ్యానికి గురికావడంతో కుమార్తెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. డాక్టర్లు ఆమె గర్భవతి అని నిర్ధారించడంతో తల్లిదండ్రులు షాకయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఆ విద్యార్థిని మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. నిందితులు బాలిక కుటుంబ సభ్యులను బెదిరించినట్లుగా ఉన్న ఫోన్ రికార్డింగ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఆ బాలిక తీవ్రమైన మానసిక వేదనలో ఉండటంతో సోమవారం రాత్రి వరకు కేసు నమోదు కాలేదు. బాధితురాలి తల్లిదండ్రులు పేదవారు కావడం, పైగా నిందితుల నుంచి ప్రాణహాని ఉందని భయపడుతుండటంతో అధికారులు బాలికను, శిశువును సురక్షితంగా ఉంచేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంరక్షణలోకి తరలించాలని నిర్ణయించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.







# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా
# కూటమి ప్రభుత్వ పాలన.!

**క్లిష్ట పరిస్థితుల్లోనూ అభివృద్ధి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రజలకు తెలియాలి.**
**కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాం. -జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్, మార్చి 31:**
అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు గా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.
మంగళవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు 2026-27 బడ్జెట్ ఔట్రీచ్ కార్యక్రమం నిర్వహించారు.
సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ కుమార్,ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం టీడీపీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు టీడీపీ పార్టీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి, వివిధ కార్పొరేషన్ ల ఛైర్మన్ లు, డైరెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ మార్చి 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం బడ్జెట్ ఔట్రీచ్ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆర్థికపరమైన ఇబ్బందులు ఎన్ని ఉన్నా, ఏ విధంగా ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందో ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు.2024 వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్ మీద ఉందని,వెంటి లెటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారం తో చంద్రబాబు చక్కదిద్దుతున్నారని మంత్రి తెలిపారు. అధికారం మారితే అభివృద్ధి కోసం మారాలి కానీ విధ్వంసం వైపు మారకూడదని మంత్రి తెలిపారు.





విభజన సమయంలో 58 శాతం జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్ కు, కేవలం 46 శాతం మాత్రమే వనరులు దక్కాయని, నిత్యం ప్రకృతి విపత్తులు, తుఫానుల తో అల్లాడే రాష్ట్రాన్ని చంద్రబాబు మెరుగైన పాలనతో గాడి లో పెట్టారని తెలిపారు.రాష్ట్ర విభజన కంటే 2019-24 లో ఎక్కువ నష్టం జరిగిందన్నారు..
గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ లు కడుతూ, క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.
ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో పెన్షన్లను అందించడం జరుగుతోందన్నారు. పెన్షన్ల కోసం 2026-27 లో రూ. 33,485 కోట్లు, దీపం 2 పథకం కోసం రూ.2601 కోట్ల, స్త్రీ శక్తి కోసం రూ.1420 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9668 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం కోసం రూ. 6600 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఆర్థిక సంక్షోభం ని అవకాశంగా తీసుకొని ముఖ్యమంత్రి పరిపాలన చేస్తున్నారన్నారు.మెగా డీఎస్సీ ద్వారా 16300 టీచర్లను భర్తీ చేయడం జరిగిందన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఒకటి టీచర్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు 2005 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 4,5 లక్షల మందికి ఐదు రూపాయలకే భోజనం అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం కింద ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే, అందరికీ ఇస్తున్నామన్నారు. స్త్రీ శక్తి కింద మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నామన్నారు. దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్ లను అందించడం జరుగుతోందన్నారు.. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి 20,000 చొప్పున అందిస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్లకు సేవలో భాగంగా 15000 అందిస్తున్నామన్నారు. అలాగే మత్స్యకారులకు కూడా సాయం చేయడం జరుగుతోందన్నారు. ఉగాదికి జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేశామన్నారు. ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు అందిస్తున్నామన్నారు.
గత 5 ఏళ్ల పాలన లో విద్యార్థులను మన రాజధాని ఏది అంటే చెప్పలేని పరిస్థితి ఉండేది కాదన్నారు.
నేడు అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి ని శాశ్వత రాజధానిగా నిర్మిస్తున్నామన్నారు. అమరావతి ద్వారా వచ్చే ఆదాయాన్ని 175 నియోజకవర్గాలకు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసిన పరిస్థితి నుంచి 2027 కల్లా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల ద్వారా గుంతలు లేని రోడ్లను తీర్చిదిద్దుతున్నామన్నారు.20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.. రాష్ట్రం వదిలి పారిపోయిన పారిశ్రామిక వేత్త లను, పరిశ్రమలను తిరిగి తీసుకొస్తున్నామన్నారు. రైతులు నష్టపోకుండా పంటలను కొనుగోలు చేసి ఆదుకుంటున్నామన్నారు.
కర్నూలు జిల్లా లో 52 శాఖలకు రూ. 2833, 48. 61 లక్షలతో ఈ ఏడాది బడ్జెట్ ను కేటాయించడం జరిగిందన్నారు. రూరల్ డెవలప్మెంట్, వైద్య విద్య, పాఠశాల విద్య, పంచాయతీరాజ్, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్లకు ఎక్కువ మొత్తంలో బడ్జెట్ కేటాయింపు జరిగిందన్నారు. ఇది కాక జిల్లాలో సూపర్ సిక్స్ పథకాల అమలుకు 2394,24.63 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. జిల్లా ఇండస్ట్రియల్ హబ్ గా అభివృద్ధి చెందుతోందన్నారు.





రిలయన్స్, సిగాచి, విరూపాక్షి బల్క్ డ్రగ్, అగస్త్య సోలార్ తదితర పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వేలాదిమందికి ఉపాధి లభిస్తుందన్నారు..కర్నూలు పశ్చిమ ప్రాంతం అభివృద్ధి పై మాస్టర్ ప్లాన్ తయారు చేయమని చంద్రబాబు ఆదేశించారు. త్వరలోనే కర్నూలు పశ్చిమ ప్రాంతానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. తుంగభద్ర డ్యామ్ కు 33 గేట్లకు గానూ, 19 గేట్లు కొత్తవి ఏర్పాటు చేశాం. మిగిలిన గేట్లను మే చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు.
శ్రీశైలం ప్లంజ్ పూల్ ప్రమాదం లో ఉందని నిపుణులు చెప్పినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి, ప్లంజ్ పూల్ మరమ్మతులు చేపట్టామన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం మొన్ననే రూ. 59 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిచామన్నారు.. హెచ్ ఎన్ ఎస్ ఎస్ కోసం ఒక సంవత్సరంలో రూ.3860 కోట్లు ఖర్చు పెట్టామని, గత ప్రభుత్వం ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని, తట్టెడు మట్టి కూడా తీయలేదని, మోటార్లకు కరెంట్ బిల్లులు కూడా చెల్లించలేదని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కరెంటు కోతలు లేవని, ప్రతి రంగంలో ముఖ్యమంత్రి ఎన్నో సంస్కరణలు తెచ్చారని మంత్రి తెలిపారు.. బడ్జెట్ ఔట్రీచ్ గురించి ప్రజలకు తెలియాలని, ప్రతి గ్రామం, మండలం, మున్సిపాలిటీ జిల్లాలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియచేయాలని మంత్రి సూచించారు.



## పదవి వీరమణ పొందిన సబ్ ఇన్స్పెక్టర్
# టిఎండి. రఫిక్ కు సన్మానం.

**సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించడం అభినందనీయం.**
**..జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 31:**
సుధీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పోలీసు అధికారులు పదవి వీరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ తెలిపారు.నంద్యాల జిల్లాలోని నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ రఫిక్ నేడు పదవి వీరమణ పొందారు. ఈయన 1989 సంవత్సరంలో కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలో తన ప్రయాణాన్ని ప్రారంభించి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ లలో పనిచేయడం జరిగింది.2011 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్ గా,2016 సంవత్సరంలో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది ప్రస్తుతం నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించడం జరిగింది.
ఈ సంధర్బంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సబ్ ఇన్స్పెక్టర్ టీఎండీ రఫిక్ ని శాలువ, పూలమాలతో నంద్యాల జిల్లా ఎస్పీ గారు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సబ్ ఇన్స్పెక్టర్ తో మరియు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలు(వివరాలు) అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీరు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా నన్ను సంప్రదించవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ మంజునాథ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు స్వామి నాయక్, వీరమణ పొందిన ఎస్సై రఫిక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాలో పరిశ్రమలకు ఊతం

## - రూ.97 లక్షల రాయితీలకు ఆమోదం

**12 పరిశ్రమల యూనిట్లకు ఆర్థిక ప్రోత్సాహం - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 31**
ఉత్పాదన, సేవా రంగాల్లో 12 యూనిట్లకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డి ఐ ఈపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, డి ఆర్ డి ఏ పి డి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 868 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా 846 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 22 దరఖాస్తులను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా ప్రభుత్వ పథకాల ద్వారా పెట్టుబడి రాయితీలు, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీలపై సబ్సిడీలు, సేల్స్ ట్యాక్స్ రాయితీలు వంటి ప్రయోజనాల కింద ఉత్పాదన మరియు సేవా రంగాలకు చెందిన 12 పరిశ్రమల యూనిట్లకు మొత్తం రూ.97.08 లక్షల రాయితీలను కమిటీ ఆమోదించినట్లు తెలిపారు. జిల్లాలో నూతనంగా ఆమోదం పొందిన 19 ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర అవగాహన కలిగి, భూసంబంధిత సమస్యలు, నీటి వనరులకు సంబంధించిన అడ్డంకులు వంటి అంశాలను విశ్లేషించి, తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎన్ ఈ డి సి ఏ పి తో సమన్వయం చేసుకుంటూ ప్రతి ప్రాజెక్టులో ఎదురవుతున్న సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే జాయింట్ కలెక్టర్‌కు సమాచారం చేరే విధంగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల మేనేజర్‌కు సూచించారు. జిల్లాలోని 44 విభాగాల్లో 12 విభాగాల పనితీరు నిరుత్సాహకరంగా ఉన్న నేపథ్యంలో, వాటి పనితీరును మెరుగుపర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద ఈ ఆర్థిక సంవత్సరానికి 260 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు కేవలం 90 మందికి మాత్రమే శిక్షణ పూర్తయినట్లు వెల్లడైందని, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం విశ్వకర్మ పథకం అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు. శిక్షణ కేంద్రాల పనితీరు, లబ్ధిదారులకు అందాల్సిన టూల్ కిట్లు, రుణాల మంజూరు తదితర అంశాలపై వివరాలు ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు 3,662 మందికి శిక్షణ పూర్తవగా, సుమారు 7,000 మందికి పైగా అభ్యర్థులు ఆమోదం పొందినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కోబ్లర్ (చెప్పులు కుట్టే వారు), గోల్డ్‌స్మిత్ (బంగారు పనివారు) విభాగాలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతంలో పనిచేసిన 9 ప్రైవేట్ శిక్షణ కేంద్రాలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా బ్యాంకుల ద్వారా మంజూరైన రుణాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమగ్ర నివేదికను 3 రోజుల్లో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం ఎంఎస్‌ఎంఈల సంఖ్య, మండల వారీగా ఎంఎస్‌ఎంఈలు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ల వివరాలు, ఆన్‌లైన్ రిపోర్టులు మరియు పెండింగ్ స్థితిగతులపై పూర్తి సమాచారం వెంటనే సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# గుంతనాల, బి.శివరామపురం గ్రామలలో సి.సి. రోడ్లను ప్రారంభించిన మంత్రి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ మార్చి 31:**నంద్యాల మండలం గుంతనాల, బి.శివరామపురం గ్రామలలో అభివృద్ధి పనులు వేగంగా పుంజుకుంటున్నాయి. గుంతనాల, బి.శివరామపురం గ్రామలలో నూతనంగా నిర్మించిన సి.సి. రోడ్లను మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధియే రాష్ట్ర అభివృద్ధి అని, ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు . గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుంతనాల మరియు బి.శివరామపురం గ్రామలలో నిర్మించిన సి.సి. రోడ్డు వల్ల స్థానికులకు రవాణా ఇబ్బందులు తొలగుతాయని, రాబోయే రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు కులమతాలకు అతీతంగా అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని, అధికార యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పని చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహకరించిన అధికారులు, గ్రామ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గుంతనాల సర్పంచ్ ఎం. నాగలక్ష్మి, గుంతనాల గ్రామ టిడిపి ఇంచార్జి నాగేశ్వరరావు, మిట్నాల ఎంపీటీసీ చిలుకూరి సుజాత, కేసీ కెనాల్ నీటి సంఘాల అధ్యక్షులు చిలుకూరి రవిబాబు, టిడిపి నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, గుంతనాల ఆనందరావు, ప్రదీప్ రెడ్డి, మిద్దె హుస్సేన్, ఎంపీడీవో, ఎమ్మార్వో, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు స్థానిక టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కొత్తపల్లె గ్రామంలో పలు అభివృద్ధి పనులను

## ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్, తాతిరెడ్డి తులసిరెడ్డి.

### సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులకు మంత్రి ఫరూక్ చేతుల మీదుగా ఘన సన్మానం.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 31:**
నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి గారితో కలిసి ఈ పనులను ప్రారంభించారు. కొత్తపల్లె గ్రామ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-2 భవనాన్ని మంత్రి ఫరూక్, తులసిరెడ్డి తో కలిసి ప్రారంభించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నూతనంగా నిర్మించిన సి.సి. రోడ్లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజల గుమ్మం వద్దకే తీసుకువచ్చామని . సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, గ్రామంలోనే అన్ని రకాల సేవలు అందేలా నూతన సచివాలయ భవనాన్ని నిర్మించి ప్రారంభించామని తెలిపారు. గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా నిధులు కేటాయిస్తూ, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కొత్తపల్లె గ్రామంలో సి.సి. రోడ్ల నిర్మాణం ద్వారా రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కులమతాలకు అతీతంగా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా పారదర్శకమైన పాలన అందిస్తున్నామని, అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సహకారంతో కొత్తపల్లె గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని. నేడు ప్రారంభించుకున్న సచివాలయం 2 మరియు సి.సి. రోడ్లు గ్రామ ముఖచిత్రాన్ని మారుస్తాయని తెలిపారు. ప్రజలు చిన్న చిన్న పనుల కోసం పట్టణాలకు వెళ్లకుండా, తమ గ్రామంలోనే ఉన్న సచివాలయాల ద్వారా వేగంగా, పారదర్శకంగా సేవలు పొందాలని, ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేలా చూడటంలో సచివాలయాల పాత్ర కీలకం పోషిస్తుందని తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిలో సి.సి. రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయని, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ భవనాలను, రోడ్లను ప్రజలు కాపాడుకోవాలని, అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడకుండా పనులు పూర్తి చేశామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను మంజూరు చేయించి గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు పార్టీ వెంట ఉండి పార్టీ నే నమ్ముకుని ఉన్న టిడిపి సీనియర్ 30 నాయకులకు ఘనంగా మంత్రి ఫరూక్ చేతుల మీదగా సన్మానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మహేష్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, సుబ్బారెడ్డి , శేఖర్ రెడ్డి, మనీష్ రెడ్డి, సర్పంచ్ నారాయణ, ధనుంజయ గౌడ్, నక్క చిన్నయ్య, కాంట్రాక్టర్ దక్షిణరెడ్డి, ఈశ్వరయ్య, ఎమ్మార్వో శ్రీనివాసులు, ఎంపీడీవో సుగుణ శ్రీ, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, మండ్ల గుర్రప్ప, చలం బాబు, నాగేశ్వరరావు, నందం బాబురావు,డిపో గఫార్, స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యా రంగంలో అంజద్ బాషా సిద్ధిఖీ సేవలు చిరస్మరణీయం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 31:**



నంద్యాల పట్టణంలోని ఎన్.జి.ఓ. కాలనీలో గల ఖలీల్ సిద్ధిఖీ ఎయిడెడ్ హైస్కూల్లో ఉర్దూ మున్షీగా సుదీర్ఘ కాలం సేవలందించిన అంజద్ బాషా సిద్ధిఖీ పదవీ విరమణ మహోత్సవం మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా జరిగింది.37 ఏళ్ల పాటు విద్యాబోధనతో పాటు సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన కృషిని కొనియాడుతూ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం మరియు వివిధ సంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అంజద్ బాషా సిద్ధిఖీ నవంబర్ 01, 1989 నుండి మార్చి 31, 2026 వరకు దాదాపు 37 సంవత్సరాల పాటు నిరంతరాయంగా విద్యా సేవలు అందించారు.వీరి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, "డాక్టర్ అబ్దుల్ హక్ స్మారక అవార్డు" తో గౌరవించింది. కేవలం ఉపాధ్యాయునిగానే కాకుండా, నంద్యాల జిల్లా ఇమాముల సంఘం మరియు మైనారిటీ సంఘాల సంస్కర్తగా సామాజికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా పేద ముస్లిం మహిళలకు ఉచిత వివాహాలు జరిపించడం, పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా పాఠశాల మేనేజర్ & కరస్పాండెంట్ ముస్తాక్ మహమ్మద్ సిద్ధిఖీ మరియు ప్రధానోపాధ్యాయులు కే.ఎం. ఫసిహుద్దీన్ సిద్ధిఖీ మాట్లాడుతూ.. అంజద్ బాషా తమ విజ్ఞానాన్ని, అనుభవాన్ని ఇన్నేళ్లపాటు విద్యార్థులకు పంచడం అభినందనీయమని కొనియాడారు. క్రమశిక్షణకు, అంకితభావానికి ఆయన నిలువుటద్దమని, ఆయన పదవీ విరమణ అనంతర జీవితం సుఖశాంతులతో, ఆరోగ్యంగా గడవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఇమాముల సంఘం నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంజద్ బాషా సిద్ధిఖీ గారిని దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# దండే రవీంద్రనాథ్ రెడ్డి, రంగ శేఖర్ రెడ్డి లను అభినందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 31:**
నంద్యాల నియోజకవర్గం, గోస్పాడు మండలం, ఎం. కృష్ణాపురం గ్రామానికి చెందిన లేట్ దండే రంగారెడ్డి కుమారులు ప్రముఖ సామాజిక కార్యకర్తలు, పి 4 మార్గదర్శులు దండే రవీంద్రనాథ్ రెడ్డి , దండే రంగ శేఖర్ రెడ్డి లను రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అభినందించారు. మంగళవారం నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వారు మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం స్థానిక పీజీఆర్ఎస్ హాల్ నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న దండే రవీంద్రనాథ్ రెడ్డి , దండే రంగ శేఖర్ రెడ్డి గ్రామంలో తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తించిన నంద్యాల జిల్లా ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్ , జిల్లా మంత్రి ఫరూక్, గ్రామాభివృద్ధిలో వారు చూపిస్తున్న చొరవను ప్రత్యేకంగా కొనియాడారు.





ఈ సందర్భంగా దండే రవీంద్రనాథ్ రెడ్డి, దండే రంగ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్) కార్యక్రమం తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. గ్రామంలో నీటి కొరతను నివారించి, ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పింఛన్లు అందని నిరుపేదలను గుర్తించి, సొంత నిధులతో నెలకు రూ. 2,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రగతి కోసం ప్రతి గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల కోసం రూ. 5,000, ఆడపిల్లల వివాహాలకు రూ. 10,000 సహాయం అందిస్తున్నామన్నారు. ఒంటరిగా ఉంటున్న వృద్ధులకు భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు హైదరాబాద్ వంటి నగరాల్లో ఉపాధి అవకాశాలు లభించేలా సహకరిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి ఫరూక్ ప్రోత్సాహంతో గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని తెలిపారు. మా సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు, నంద్యాల జిల్లా ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్,జాయింట్ కలెక్టర్ కార్తీక్ స్వయంగా గుర్తించి అభినందించడం మాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని వారు తెలిపారు . ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన పి4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్) స్ఫూర్తిని ఎం. కృష్ణాపురం గ్రామంలో దండే రవీంద్రనాథ్ రెడ్డి , దండే రంగ శేఖర్ రెడ్డి లు నిజం చేసి చూపిస్తున్నారని . ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలతో పాటు, సమాజం పట్ల బాధ్యతతో సొంత నిధులను వెచ్చించి పేద ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దాలనే వారి సంకల్పం మిగతా వారికి మార్గదర్శకమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పింఛన్లు అందని వారికి ఆర్థిక సాయం చేయడం, విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడటం, అంత్యక్రియలు మరియు వివాహాలకు సాయం అందించడం వంటి కార్యక్రమాలు వారి మానవత్వాన్ని చాటుతున్నాయని . ఇలాంటి సేవా గుణం కలిగిన వ్యక్తులకు ప్రభుత్వం తరపున ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు

# ఒక్కరోజులో కోటి దాటిన మున్సిపల్ వసూళు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 31:**



నంద్యాల మున్సిపాల్టీ పరిధిలో 30 వతేదిన ఒక్క రోజులోనే వివిధ పన్నుల రూపంలో రూ.1,00,45,604 వసూలైనట్లు రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను బలోపేతం చేయడంలో భాగంగా చేపట్టిన ప్రత్యేక వసూళ్ల డ్రైవ్ మంచి ఫలితాలను ఇస్తోందని పేర్కొన్నారు.

ఈ వసూళ్లలో ప్రధానంగా ఆస్తి పన్ను ద్వారా రూ.91,39,804, నీటి చార్జీల రూపంలో రూ.7,16,694, నీటి అంచనా చార్జీల ద్వారా రూ.51,392, పీటీ మ్యూటేషన్ ఫీజు ద్వారా రూ.1,37,714 వసూలైనట్లు వివరించారు. లీజులు, ఒప్పందాల ద్వారా ఆ రోజున ఎలాంటి వసూళ్లు నమోదు కాలేదని తెలిపారు.పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని రెవెన్యూ అధికారి కోరారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ వసూళ్లు ఉపయోగపడతాయని చెప్పారు.**వసూళ్ల వివరాలు:** ఆస్తి పన్ను రూ.91,39,804,నీటి చార్జీలు రూ.7,16,694,నీటి అంచనా చార్జీలు రూ.51,392, పీటీ మ్యూటేషన్ ఫీజు రూ.1,37,714,మొత్తం రూ.1,00,45,604

# శ్రీ మద్దిలేటి నరసింహా స్వామి దేవస్థానం నుండి లెక్కింపు.



**ఆంధ్ర ప్రగతి ఆర్ఎస్ రంగాపురం/ బేతంచెర్ల మార్చి 31:** శ్రీ మద్దులేటి నరసింహ స్వామివారి దేవస్థానం నందు శ్రీ స్వామి, అమ్మవారికి భక్తులు సమర్పించిన ముడుపులు కానుకల హుండీ లెక్కింపు తేది: 31-03-2026 న నిర్వహించబడినది ఉపకమీషనర్ & కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు, దేవదాయశాఖ ఇన్స్పెక్టర్ డి. రమేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగినది.సదరు హుండీ లెక్కింపు ద్వారా 04-03-2026 నుండి 31-03-2026 వరకు 27 రోజుల కాలానికి గాను రూ.21,57,817/- నగదు. 5 గ్రాముల బంగారు, 340 గ్రాముల వెండి వచ్చినవి.నిత్యన్నదాన సత్రం హుండీ లెక్కింపు ద్వారా రూ.21,329/- నగదు వచ్చినది.

ఈ హుండీ లెక్కింపు నందు బేతంచెర్ల పట్టణానికి చెందిన బాలాజీ సేవా సమితి సభ్యులు మరియు డోన్ పట్టణానికి చెందిన శ్రీ మద్దిలేటి స్వామి సేవా సమితి సభ్యులు, వాసవి సేవా సమితి సభ్యులు & అమ్మవారిశాల సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా..

# అధికారుల్లో మార్పు రాదా..?

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 31:**
రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ అధికారులు విస్తృతంగా ఎక్కడో ఒక చోట దాడులు నిర్వహిస్తున్నారు.అధికారులు లంచాలు లేనిదే పనులు చేయకపోవడంతో ప్రజలు విసుగు చెందారు.అభివృద్ధి చెందుతుందని కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపిస్తే రెండేళ్లుగా అధికారుల అవినీతి కి అంతులేకుండా పోతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అధికారులు ఒక వైపు సచివాలయంలో చిన్న పని కావాలనా 10 వేలు తక్కువ లేకుండా లంచాలు అడుగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.గతంలో మున్సిపల్,రెవెన్యూ,ఆర్టీవో,సేల్ ట్యాక్స్ ,పోలీస్ స్టేషన్,టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అడుగుపెట్టాలంటే ప్రజలు భయపడేవారు.ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే ప్రభుత్వాలు సచివాలయం వ్యవస్థ ప్రజలకు మేలు జరుగుతుందని భావించి లక్షల మందికి ఉపాధి కల్పించారు.మొదట్లో సచివాలయం వ్యవస్త బాగా పనిచేస్తున్నారని పేరు తెచ్చుకున్నారు.రాను,రాను ఏ పని చేయాలన్నా అధికారుల కంటే ముందు సచివాలయంలోనే అన్ని పేపర్లు ఇవ్వాలని,వాటిని అక్కడ సిబ్బంది సమాచారం తీసుకొని ఒకే అంటేనే ( అంటే చెయ్యి బాగా తడిపితే) పనులు జరుగుతున్నాయి.కొన్ని సచివాలయంలో అధికారులను సైతం ప్రశ్నించే స్థాయికి వచ్చారు.లగ్జరీ లైఫ్ కు అలవాటు పడి సచివాలయంలో ఎప్పుడు









ఉంటారో అర్థం కానీ పరిస్థితి.ఇటీవల ఒక వార్డు సచివాలయంలో చేయాల్సిన పని మరో సచివాలయం వారు చేసిన అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.ఒక్క సంఘటనతో ఓ స్తలం విషయంలో రెండు వర్గాల మధ్య అగ్గి రాజేసింది.ఈ నేపథ్యంలోనే ప్రజలకు కొందరు అధికారులు న్యాయం చేయక లంచాల మత్తులో జోగుతున్నారని పిర్యాదులు అధికం కావడంతో ప్రభుత్వం లంచగొండి అధికారుల భరతం పట్టడానికి ఏసీబీ దాడులు ముమ్మరం చేసింది.ప్రధానంగా సబ్ రిజిస్టర్ కార్యాలయాలు,రెవెన్యూ కార్యాలయాలు,పోలీస్ స్టేషన్ లపై దాడులు సాగిస్తున్నారు.రోజు ఏదో ఒక ప్రాంతంలో ఏసీబీ అధికారులకు ఏదో ఒక శాఖకు చెందిన అధికారులు పట్టుబడుతున్న విషయం విదితమే.లక్షల్లో జీతాలు,సంఘంలో గౌరవం ఉన్నా,అధికారులు కొందరు కాసులకు కక్కుర్తి పడి ప్రజలను జలగల్లా పీడిస్తున్నారు.కొందరు అధికారులు మాత్రం రాజకీయ నాయకులు,ఉన్నత అధికారులకు ప్రోటోకాల్ ఖర్చులు లక్షల్లో ఖర్చు అవుతుంటే ప్రభుత్వం ఇస్తుందా,ఉన్నతాధికారులు ఇస్తారా,రాజకీయ నాయకులు ఇస్తారా మేము ఎక్కడ నుంచి తీసుకొని రావాలి.లంచాలు తీసుకుంటే ఖర్చులు ఎలా పెడతాము అని కొందరు అధికారులు చెప్పుకొస్తున్నారు.మరి కొందరు అధికారులు మాత్రం వారి బాధ వర్ణనాతీతం,ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ కావాలంటే ఆ నియోజకవర్గం నాయకుని లెటర్ కావాలంటే లక్షలు ఇస్తే కానీ ఇవ్వడం లేదని,బాగా ఆడటం ఉన్న షాకు ప్రతి నెల మామూళ్లు ఇవ్వాల్సిందే అని చెప్పి బాధపడడం విశేషం.రాజకీయ నాయకులు ప్రతి పోస్టుకు డబ్బులు,ఇసుక దోపిడి,కుందూ మొరుసు దోపిడి,ఒక్కటేమిటి ప్రతి అసంగిక కార్యకలాపాలకు రాజకీయ నేతలకు డబ్బులు ఇవ్వనిదే ఏమి జరగవు అన్న విషయం అందరికీ తెలిసిందే.రాజకీయ నాయకులు లంచాలు తీసుకోకుండా ఎవరైనా ఉన్నారా మనస్సాక్షిగా,వారు నమ్మిన దేవిని సాక్షిగా బహిరంగంగా చెపుతారా అని కొందరు అధికారులు ప్రశ్నిస్తున్నారు.ప్రధానంగా నంద్యాలలో సచివాలయం కు వెళ్ళాలంటే బయ పడే పరిస్థితులు ప్రజలు అనుభవిస్తున్నారు.పని వత్తిడి అంటారు.ఒక్క మాట సూటిగా చెప్పండి.ప్రతి నెల మీరు చేస్తున్న పని వివరాలు చెపుతారా.చివరికి ప్రతి వార్డుల్లో జరిగే సమస్యలు మీడియా చెప్పేంత వరకు వారికి తెలియకుండా ఉందంటే వారు చేస్తున్న సేవలు తెలుసుకోవచ్చు. సచివాలయంలో 10 శాఖలకు చెందిన వారు విధులు నిర్వహిస్తారు.ప్రతి రోజు ఆయా వార్డుల్లో వారు తిరిగితే సమస్యలు ఉంటాయా.ఏది ఏమైనా రాజకీయ నాయకుల అవినీతి,అధికారుల అవినీతి,సచివాలయల అవినీతి నీ ఏసీబీ అధికారులు లెవెల్ చేయాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.